

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



అక్షర రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | ఆదివారం | 12.04.2026 | సంపుటి: 3 | సంచిక: 71 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SUNDAY | 12.04.2026 | VOLUME : 3 | ISSUE : 71 | PAGES: 8 | COST: 2/- |



# విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575


జమిలి ఎన్నికలకు కేంద్రం సిద్ధం!

## దేశంలో జమిలి నగారా?

2027–28లో ఎన్నికల నిర్వహణకు కేంద్రం కసరత్తు!

రాజ్యాంగ సవరణలు, న్యాయ నిపుణులతో చర్చలు పూర్తి..

ఒకే దేశం ఒకే ఎన్నిక దిశగా అడుగులు



3

## తృణమూల్‌కు ఓటమి భయం

- అందుకు బీజేపీపై దాడులు
- బెంగాల్ సభలో ప్రధాని మోదీ

4





## హర్మూజ్ దాటిన మరో భారతీయ నౌక

కాల్పుల విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం

4



# పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకం

సామాజిక మార్పునకు కేంద్రంపై ఒత్తిడి

పూలే జయంతి కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, ఏప్రిల్ 11:
సామాజిక మార్పునకు దక్షిణాది రాష్ట్రాలు కేంద్రంపై ఒత్తిడి చేస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. రవీంద్ర భారతిలో శనివారం జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే 200 జయంతి కార్యక్రమంలో

మిగతా 2వ పేజీలో..

అమీన్‌పూర్‌లో

# హైడ్రా భారీ ఆపరేషన్

2

- 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- రూ.15 వేల కోట్ల భూమికి రక్షణ







## మహిళా విద్యకు ఆద్యులు పూలే దంపతులు

- ఓబీసీల, మహిళాభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయం
- జ్యోతిరావు పూలేకు నివాళులర్పించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

3



3

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

అధికారికంగా ప్రకటించిన బోర్డు

## చనిపోయిన కానిస్టేబుళ్ల వివరాలతో జీతాలు డ్రా

- కరీంనగర్‌లో రూ. 1.40 కోట్ల స్కామ్
- మరణించిన పోలీస్ శాఖ ఉద్యోగుల వివరాలతో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం
- ఆరుగురి నిందితులపై క్రిమినల్ కేసులు

2

## రేవంత్ చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు

- ఏఐ ఫొటోలతో ఫ్యూచర్ సిటీ అని మభ్యపెడుతున్నారు
- ఫోర్త్ సిటీ అంటూ తన వారికి భూములు కట్టబెట్టే కుట్ర
- మరో 50 ఏళ్ల దాకా కాంగ్రెస్ అధికారంలోకి రాదు
- నిషేధిత భూముల జాబితాతో బ్లాక్ మెయిల్
- సర్కారుపై బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ ఫైర్

2





3

20న మోతెలో కేసీఆర్

## భారీ బహిరంగ సభ

సభాస్థలిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

పంట కొనుగోళ్లలో

## తీవ్ర నిర్లక్ష్యం



3

సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు

కార్యకర్తలే

## పార్టీ బలం

- కాంగ్రెస్ పార్టీ శాశ్వతం, ప్రభుత్వాలు వస్తాయి పోతాయి
- ప్రజలే అధికారానికి కారణం
- కాళేశ్వరం.. అవినీతికి నిదర్శనం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

2





బీసీల అభ్యున్నతికి

## కట్టుబడి ఉన్నాం

- పూలే ఆశయ సాధనలో ప్రతివారూ భాగస్వాములు కావాలి
- జయంతి కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

2

జీసీసీల గమ్యస్థానంగా

## హైదరాబాద్

- మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 11:
ప్రపంచంలోని దిగ్గజ ఫైనాన్స్ సంస్థలన్నీ తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జీసీసీల) ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని గమ్యస్థానంగా ఎంచుకున్నాయని ఐటి,

మిగతా 3వ పేజీలో..





### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹66

# కార్యకర్తలే పార్టీ బలం

- కాంగ్రెస్ పార్టీ శాశ్వతం
- ప్రభుత్వాలు వస్తాయి పోతాయి
- ప్రజలే అధికారానికి కారణం
- కాళేశ్వరం.. అవినీతికి నిదర్శనం
- టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

**ములుగు, ఏప్రిల్ 11:**

ఎనిమిది లక్షల కోట్ల అప్పుతో రాష్ట్రం దెబ్బతిన్నది టిపి సిసి మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివా రం ములుగు జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షు కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సమావేశానికి టీ డు అశోక్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక ఘట్టమ్మ దేవాలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘట్టమ్మ దేవాల యం నుండి భారీ ర్యాలీగా బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు ములుగు జిల్లా కేంద్రానికి చేరుకోగా అక్కడ నాయకులు మహేష్ కు మార్ గౌడ్ కు గజమాలతో ఘన సన్మానం చేశారు. అదే ఉత్సాహంతో ర్యాలీ కొనసాగు తూ లీలా గార్డెన్ వరకు చేరుకుని సమావేశ ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించిన ఆయన రాష్ట్ర మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్‌తో కలిసి పాల్గొని డీసీసీ కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించి పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేయాలని పిలు పునిచ్చారు. ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యక ర్తలు పాల్గొని కాంగ్రెస్ శక్తిని చాటిచెప్పారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు వస్తాయి పోతాయ్ కానీ కాంగ్రెస్ పార్టీ శాశ్వతమని, కార్యకర్తలే పార్టీకి అసలైన బలం అని స్పష్టం చేశారు. సమ్మక్క సారక్క జాతర అభివృద్ధికి రూ.200 కోట్లకు పైగా నిధులు కేటాయించి పనులు కొనసాగుతున్నాయని, గ్లోబల్ సమ్మిట్ ద్వారా రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చినట్లు వివ రించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ కేసీఆర్ ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి ఫామ్ హౌస్ కు పరిమిత మయ్యారని, కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవ డం అవినీతి పాలనకు నిదర్శనమని ఆరోపించారు. మామ అల్లుడు అవినీతి వల్లే ఆ ప్రాజెక్టుకు ఈ గతి వచ్చిందని, కుటుంబ పా లనతో రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శిం చారు. దొడ్డు బియ్యం పేరుతో ప్రజల డబ్బు లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. బీజేపీపై కూడా విమర్శలు చేస్తూ 12 ఏళ్ల పాలనలో తెలంగాణకు ఎలాంటి లాభం చే కూరలేదని, లాభాల్లో ఉన్న ప్రభుత్వ సంస్థలను అంబానీ, అదానీలకు కట్టబెట్టారని అన్నారు. దేవుడి పేరుతో రాజకీయాలు చేసే పార్టీగా బీజేపీ ఉందని, రాష్ట్రంలో ఆ పార్టీకి స్థానం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కుల సర్వే నిర్వహించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు పెద్దఎత్తున అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. మంత్రి సీతక్కపై ప్రస్తావిస్తూ ఒకప్పుడు తుపాకీతో పోరాడిన ఆమె ఇప్పుడు మంత్రిగా ప్రజలకు సేవ చేస్తోందని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ 100కు పైగా సీట్లు గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని పేర్కొంటూ నూతన బాధ్యతలు స్వీకరించిన నాయకులకు అభినందనలు తెలిపారు. జై హింద్, జై కాంగ్రెస్ అంటూ ప్రసంగాన్ని ముగించారు.

# పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకం

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ప్రసంగించారు. తొలుత పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలన్నారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో, సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామన్నారు. పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం తాము అడుగులు వేస్తున్నామన్నారు. ఆనాడు ఆయనలాంటి మహనీయులే వివక్షకు గురైనా భవిష్యత్ తరాల కోసం వారు వేసిన పునాదులే మార్గదర్శకాలని భట్టి చెప్పారు.


**సబ్బండ వర్గాల అభ్యున్నతే మా సంకల్పం : మంత్రి శ్రీధర్‌బాబు**

ఒక గొప్ప మేధావి ఆలోచనలు నిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తూనే ఉంటాయని, అలాంటి ఒక నిరంతర చైతన్యం అక్షరమే ఆయుధంగా సామాజిక సమానత్వమే లక్ష్యంగా పోరాడిన తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. వ్యవస్థలో పైకి కనిపించే మార్పు కంటే మనుషుల ఆలోచనా తీరు మారడమే నిజమైన సామాజిక విప్లవం అని నమ్మి ఆ దిశగా చివరి శ్వాస వరకు కృషి చేసిన ఆ మహనీయుని సేవలను స్మరించుకున్నారు. ఆయన జయంతి సందర్భంగా చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. పూలే వెలిగించిన ఆ చైతన్య దీపాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం స్ఫూర్తిగా తీసుకుని ఆయన చూపిన బాటలో ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రంలోని సబ్బండ వర్గాలకు విద్య, ఆర్థిక సాధికారతను అందిస్తూ ఆలోచనల్లోనూ, అవకాశాల్లోనూ సమానత్వం తీసుకొచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఆ మహనీయుని ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తునానన్నారు.

# ఎన్నో ఏళ్ల కల నెరవేరబోతోంది

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**హైదరాబాద్, ఏప్రిల్ 11:**



పార్లమెంట్‌లో నారీ శక్తి వందనం బిల్లును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈనెల 16వ తేదీన ప్రవేశపెట్టనున్నారని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ బిల్లు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆమె శనివారం మీడియాతో మాట్లాడారు. ఈ బిల్లు అమలైతే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ దక్కుతుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతం రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం ఈనెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు పెట్టారని వెల్లడించారు. కాంగ్రెస్ సహా అనేక పార్టీలు మహిళా బిల్లును వ్యతిరేకించాయని తెలిపారు. గతంలో చాలామంది ఈ బిల్లు తేవాలని చూశారని, మోదీ ఈ బిల్లును సుసాధ్యం చేయనున్నారని చెప్పారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తోందని ఉద్ఘాటించారు. చట్టసభల్లో కూడా మహిళలు ఉంటే ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల్లో వారికి ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారని తెలిపారు. వికసిత్ భారత్ 2047 లక్ష్యానికి ఎంతో దూరం లేదని, కానీ మహిళా శక్తికి రాజకీయ శక్తి తోడైతే వికసిత్ భారత్ లక్ష్యానికి సులువుగా చేరుకోవచ్చని వివరించారు. ఈ బిల్లుకు ఆమోదం తెలిపితే క్రెడిట్ బీజేపీకి ఎక్కడ పోతుందోనని ఆలోచించకుండా పార్టీలకతీతంగా అందరూ మద్దతు తెలపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. చట్టానికి ఆమోదం తెలిపితే కొత్త శకానికి నాంది పలకనుందని వ్యాఖ్యానించారు. ఈ బిల్లు అమలైతే స్థానాలు పెరుగుతాయని, డీ లిమిటేషన్ కూడా పూర్తయితే తెలంగాణ నుంచి 9 మంది మహిళలు పార్లమెంట్‌లో అడుగుపెడతారని తెలిపారు. తెలంగాణలో మొత్తం అసెంబ్లీ స్థానాలు 180 వరకు పెరుగుతాయని, అంటే 60 మంది మహిళలు అసెంబ్లీలో ఉంటారని వివరించారు. ఎస్సీ, ఎస్టీలకు కూడా మంచి అవకాశాలు రానున్నాయని వివరించారు. ఇది తాత్కాలికం కాదని.. మూడు టర్మ్‌ల వరకు ఈ రిజర్వేషన్లు కొనసాగుతాయని వెల్లడించారు.

# రేవంత్ చరిత్రహీనుడిగా మిగిలిపోతాడు

- ఏఐ ఫొటోలతో ఫ్యూచర్ సిటీ అని మభ్యపెడుతున్నారు
- ఫోర్త్ సిటీ అంటూ తన వారికి భూములు కట్టబెట్టే కుట్ర
- మరో 50 ఏళ్ల దాకా కాంగ్రెస్ అధికారంలోకి రాదు
- నిషేధిత భూముల జాబితాతో బ్లాక్ మెయిల్
- సర్కారుపై బీఆర్ఎస్ అగ్రనేత కేటీఆర్ ఫైర్



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 :**

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల, అన్యాయాల ఫలితంగా మరో 50 సంవత్సరాల దాకా ఆ పార్టీ తిరిగి అధికారంలోకి రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జోస్యం చెప్పారు. ఫ్యూచర్ లేని రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కడతానని ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇబ్రహీంపట్నంలో శనివారం జరిగిన పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లను, సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్, మంత్రి పొంగులేటిలపై విరుచుకుపడ్డారు. ఏఐ చిత్రాలతో ఫ్యూచర్ సిటీ అని కొత్త కుట్రకి రేవంత్ రెడ్డి తెరలేపారన్నారు. ఫ్యూచర్ సిటీ తన కుటుంబ సభ్యుల, తన అనుచరుల భూమి కుంభకోణాల కోసమే అని కేటీఆర్ మండిపడ్డారు. అన్ని వర్గాలను మోసం చేస్తూన్న రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని వ్యాఖ్యానించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఆ విషయం మర్చిపోయి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలు ఖచ్చితంగా బుద్ధి చెబుతారన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం రెండు నెలల పాటు అన్యాయాలు, అక్రమాలు చేసిన తర్వాత ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ జెండా ఎగిరిందన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వాళ్లు గెలిచిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీ చైర్మన్ పదవులను తీసుకునేందుకు అనేక దురాగతాలకు పాల్పడిందని, చివరికి న్యాయం గెలిచిందని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే అరాచకాలను ఎదుర్కొని బలంగా నిలబడిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి కుమారుడు, పార్టీ యువ నాయకుడు ప్రశాంత్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఇక ఫార్మా సిటీ పేరుతో రేవంత్ భూముల దందా చేస్తున్నారన్నారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సేకరించిన 14వేల ఎకరాల ఫార్మా సిటీ భూములను తిరిగి రైతన్నలకు ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని ఇప్పుడు ఫోర్త్ సిటీ పేరుతో మోసం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు కోర్టులో ఫార్మా సిటీ ఉందని చెబుతూ బయటకు వచ్చి అవే భూముల్లో ఫోర్త్ సిటీ కడతామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నదన్నారు. ఆనాడు ఫార్మా సిటీ భూముల్లో అప్పటి సీఎల్పీ నాయకుడిగా ఉన్న భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా మిగిలిన మేధావులు పాదయాత్ర చేసి తమకు ఓటు వేస్తే మీ భూములు మీకు తిరిగి అప్పజెపుతాం' అని హామీ ఇచ్చారని, రెండున్నరేళ్ల తర్వాత మరో 16 వేల ఎకరాల అదనపు భూమిని రైతుల నుంచి గుంజుకొని ఫోర్త్ సిటీని, భారత్ ఫ్యూచర్ సిటీని కడతానని నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఉన్న సిటీనే పట్టించుకునే తెలివి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ కడతానని మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వం కోహెడలో 178 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కడతామని అంటే ఇప్పుడు రాచకొండ గుట్టలకో, రామోజీ ఫిలిం సిటీ అవతలకో పోవాలని ప్రభుత్వం చెబుతున్నదన్నారు. ఈ భూమి అమ్ముకునేందుకు రేవంత్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. నిషేధిత భూముల జాబితాను తగ్గించి భూమి సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 16 లక్షలు ఉన్న నిషేధిత భూముల సంఖ్యను కోటి ఎకరాలకు పెంచి అందరినీ బ్లాక్ మెయిల్ చేస్తూ భూముల దందా చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ నిషేధిత జాబితాను అడ్డుపెట్టుకొని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతూ సెటిల్మెంట్లకు పాల్పడుతున్నారన్నారు. ఇక ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అవినీతి, అరాచకాల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా రేవంత్ రెడ్డి లాంటి అరాచక శక్తిని ఎదుర్కొని, అక్రమ కేసులను ఎదుర్కొని పార్టీతోనే నిలబడి మున్సిపల్ పీఠాన్ని దక్కించుకున్న ప్రతి ఒక్క నాయకుడికి, మున్సిపల్ కౌన్సిలర్‌కు పేరు పేరునా ధన్యవాదాలు చెబుతున్నానని కేటీఆర్ తెలిపారు. అధికారులు కాంగ్రెస్ పార్టీ ప్రలోభాలకు లొంగి అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని, రానున్న తమ ప్రభుత్వంలో వారందరినీ గుర్తుంచుకొని మరీ తగిన విధంగా శిక్షిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు ప్రజల కోసం పని చేయాలని కేటీఆర్ సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేష్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్‌వే**

ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్త నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని, రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంలో రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని, తాను జగిత్యాలకు వెళితే అక్కడ కలిసిన ఓ రైతు సోదరుడు రేవంత్ మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిండు.. రూ.27వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి రూ.20 వేల కోట్లు ఇచ్చి రుణ మాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు.. మా పైసలు మాకే ఇచ్చి మీదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ రుణమాఫీ చేసినా అని చెప్పి అది కూడా ఊరిలో చారానామందికి చేసిండు అని చెప్పిండు.. అగో గట్లుంది పాలన అని ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి గద్దెనెక్కి ఈ రెండున్నరేళ్లల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. మాటలతో మహిళలను మోసం చేసిండు. వృద్ధులను కూడా మోసం చేసిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఢిల్లీకి పోవుడు.. వచ్చుడు తప్ప చేసిందేమీ లేదని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామన్నారు. అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు ఏడు సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, తాను కష్టపడి చాలామందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా భూములు సేకరించినమని చెప్పారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# చనిపోయిన కానిస్టేబుళ్ల వివరాలతో జీతాలు డ్రా

- కరీంనగర్‌లో రూ. 1.40 కోట్ల స్కామ్
- మరణించిన పోలీస్ శాఖ ఉద్యోగుల వివరాలతో ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం
- ఆరుగురి నిందితులపై క్రిమినల్ కేసులు
- నిందితుల్లో ఇద్దరు పోలీస్ సిబ్బంది

**కరీంనగర్, ఏప్రిల్ 11:**

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. పోలీస్ శాఖలో పనిచేసి మరణించిన ఉద్యోగుల వివరాలను అడ్డు పెట్టుకుని, నకిలీ అకౌంట్ల ద్వారా సుమారు రూ.1 కోటి 40 లక్షలు ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు విచారణలో తేలింది. ఈ అక్రమాలకు సంబంధించి ఏసీపీ టాస్క్ ఫోర్స్ వాసాల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్ Iటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముఖ్య నిందితుడు హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, అతనికి సహకరించిన రిటైర్డ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వై.వి. ముని రామయ్య, నకిలీ ఖాతాల సృష్టించడంలో భాగస్వాములైన ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం చేకూర్చినా, విధి నిర్వహణలో అవకతవకలకు పాల్పడినా శాఖాపరంగా ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. పక్కాగా ప్లాన్ చేశారు : కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సంచలనం సృష్టించిన జీతాన కుంభకోణంలో ముగ్గురు ప్రైవేటు వ్యక్తులు లావుడియా రవి వాచ్ మెన్, చుక్కా గంగరాజు ప్రైవేటు డైలీ డ్రైవర్, శంకర్ నామతాబాద్ మటన్ షాప్ కీపర్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సీపీవో కార్యాలయంలోని పే సెక్షన్‌లో గతంలో పని చేసిన నీలం రామ్మోహన్ హెడ్ కానిస్టేబుల్, ఇప్పుడు చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన విధుల్లో భాగంగా గతంలో మరణించిన ముగ్గురు పోలీస్ కానిస్టేబుళ్ల సి.హెచ్. రవీందర్, కె. గంగస్వామి, కె. రవి పేర్లతో ఎంప్లాయ్ ఐడీలను సేకరించాడు. నాలుగేళ్లుగా నకిలీ ఖాతాలో డబ్బు జమ : ఆ తర్వాత వీరి పేర్లకు బదులుగా ఆ ముగ్గురు ప్రైవేటు వ్యక్తుల పేర్లతో కరీంనగర్‌లోని భగత్ నగర్, బొమ్మకల్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్రాంచీలలో నకిలీ అకౌంట్లను సృష్టించాడు. దానికి సొంత ఈమెయిల్ ఐడీల, ఫోన్ నంబర్లను లింక్ చేశారు. జూన్ 2022 నుంచి మార్చి 2026 వరకు వీరి ఖాతాల్లో ప్రతి నెలా నిబంధనలకు విరుద్ధంగా జమ అవుతూ వస్తుంది. ఇటీవల ఆడిటింగ్‌లో ఈ విషయం బయటపడింది. దర్యాప్తు జరిపిన అధికారులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని, అక్రమాలకు పాల్పడి పట్టుబడితే వారిపై కఠినమైన క్రమశిక్షణ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం హెచ్చరించారు. ప్రభుత్వ ఖజానాకు నష్టం చేసిన లేదా విధి నిర్వహణలో ఏవైనా అవకతవకలకు పాల్పడినా పోలీస్ శాఖలో ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ పారదర్శకంగా, జవాబుదారీతనంలో విధులు నిర్వహించాలని ఆదేశించారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, ఇక్కడ పని చేసిన రిటైర్డ్ ఆఫీసర్ మని రామయ్య మిగతా ముగ్గురు ప్రైవేట్ వ్యక్తులు మొత్తం ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగింది. దీనిలో ముఖ్యంగా మరణించిన పోలీస్ కానిస్టేబుల్ ఐడీలను ఉపయోగించుకొని వాళ్లను రెగ్యూలర్ ఎంప్లైయిలా చూయించారు. ఐఎఫ్ఎమ్ ఐఎస్ పోర్టల్‌లో జూన్ 2022 నుంచి శాలరీ క్లైమ్ చేసుకున్నారు. ఒక్క అకౌంట్లో నుంచి రూ.53 లక్షలు, మరో అకౌంట్లో నుంచి రూ.39 లక్షల 79 వేలు మొత్తం రూ.1,40,18,338 శాలరీ క్లైమ్ చేయడం జరిగింది. ఈ శాలరీ ఏ అకౌంట్లో క్రెడిట్ అవుతోందని వెరీ ఫై చేశాము. ముగ్గురు ప్రైవేటు వ్యక్తుల అకౌంట్లోకి పోలీస్ శాలరీ ఎందుకు పోతుందని విచారణ చేశాం. వీరు ఈమెయిల్ ఐడీలు, మొబైల్ నంబర్‌ను ఆ అకౌంట్లను లింక్ చేసినట్లు తేలింది'' గౌస్ ఆలం, కరీంనగర్ సీపీ

# బీసీల అభ్యున్నతికి కట్టుబడి ఉన్నాం

- జయంతి కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

**ఖమ్మం, ఏప్రిల్ 11 :**

సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలే అని రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీశ్రీ సర్కిల్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారన్నారు. ఆ కాలంలో కుల, మత భేదాలు ఉన్న పరిస్థితుల్లో సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. మొదటగా తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబోధన చేసి ఆమె ద్వారా బాలికల విద్యకు మార్గం సుగమం చేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. కుల వివక్ష కారణంగా అనేక వర్గాల ప్రజలను దేవాలయాలు, పాఠశాలల్లోకి అనుమతించని పరిస్థితులను పూలే ధైర్యంగా ఎదిరించి సమాజంలో మార్పు తీసుకొచ్చారని తెలిపారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందంటూ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని శాస్త్రీయంగా నిరూపించి చిత్తశుద్ధితో ప్రయత్నించిన సంగతి రాష్ట్ర ప్రజలకు తెలుసని చెప్పారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

- 861 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- రూ.15 వేల కోట్ల భూమికి రక్షణ

**హైదరాబాద్, ఏప్రిల్ 11 :**

హైదరాబాద్ మహా నగర చరిత్రలో నిలిచిపోయే భారీ ఆపరేషన్‌ను ప్రభుత్వం శనివారం అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో నిర్వహించింది. రెవెన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంతో హైడ్రా అధికారులు 861 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని రక్షించారు. మార్కెట్ విలువ ప్రకారం ఈ భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని పలువురు విశ్లేషించి అంచనా వేస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమికి పూర్తిగా ఫెన్సింగ్ వేసి ఆక్రమణలకు చెక్ పెట్టారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న పేదలు, సామాన్యులపై ఎలాంటి చర్యలు తీసుకోబోమని అధికారులు మైక్ ద్వారా స్పష్టం చేశారు.

**అక్రమ నిర్మాణాల తొలగింపు..**

కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా పలువురు నిర్మించిన పలు అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ముఖ్యంగా ముఖీం సోదరుడు ఎఐజీం నిర్మించిన ఆరు అంతస్తుల మూడు టవర్లను తొలగించారు. అలాగే స్విమ్మింగ్‌పూల్‌తో కూడిన విలాసవంతమైన గెస్ట్ హౌస్, సుమారు 40 ఎకరాల్లో విస్తరించిన ఫామ్ హౌస్, గుర్రాల శాలలను ధ్వంసం చేశారు.

**కోర్టు ఆదేశాల అమలు..**

ఐలాపూర్ భూములపై 2013లో హైకోర్టు ఇచ్చిన యథాతథ స్థితి ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ అక్రమంగా ప్లాట్లు విక్రయాలు కొనసాగుతుండటాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలకు దిగింది.

**భూమి వివాదం నేపథ్యం**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ గ్రామంలో సర్వే నంబర్లు 1 నుంచి 220 వరకు మొత్తం 1263 ఎకరాల భూమి ప్రభుత్వానికి చెందినదిగా రికార్డుల్లో ఉంది. 2003లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు అప్పటి జాయింట్ కలెక్టర్ ఈ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటించారు. 1980 దశకంలో ఈ భూమిలో భాగంగా రాజగోపాల్‌నగర్ కాలనీ (495 ఎకరాలు), విద్యుత్ ఉద్యోగుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (131 ఎకరాలు) లేఅవుట్లు ఏర్పడ్డాయి. కాగా, 475 ఎకరాలపై ఒక కుటుంబం హక్కులు ఉన్నట్లు పేర్కొంటూ కోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ వివాదాలకు సంబంధించిన పలు కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి.

**ప్రభుత్వం స్పష్టీకరణ..**

ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూములను మాత్రమే రక్షిస్తూ ఫెన్సింగ్ వేస్తున్నామని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగవని స్పష్టం చేశారు. కోర్టు తుది తీర్పు వచ్చే వరకు భూమిని యథాతథ స్థితిలో పరిరక్షించడం లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

**సీఎం చిత్రపటానికి పాలాభిషేకం..**

ఐలాపూర్‌లో అక్రమార్కులు కట్టిన భవనాలను కూల్చివేసి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి హైడ్రా చేపట్టిన ఆపరేషన్‌పై ప్రజల నుంచి పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం అవుతుంది. ఈ మేరకు ఆనంద్ నగర్ కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఐలాపూర్ లోని సర్వే నంబర్ 1220 వరకు గల 1264 ఎకరాల భూ సమస్యను పరిష్కరించినందుకు బాధితులు సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో స్థానికులలో సంబరాలు నెలకొన్నాయి. ఇది 40 ఏళ్ల కలగా వారు పేర్కొన్నారు.



## జమిలి ఎన్నికలకు కేంద్రం సిద్ధం!
# దేశంలో 'జమిలి' నగారా?

- 2027-28లో ఎన్నికల నిర్వహణకు కేంద్రం కసరత్తు!
- రాజ్యాంగ సవరణలు, న్యాయ నిపుణులతో చర్చలు పూర్తి..
- కే దేశం - ఒకే ఎన్నిక దిశగా అడుగులు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:**

భారత ఎన్నికల చరిత్రలో ఒక భారీ సంస్కరణకు కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే 'జమిలి ఎన్నికల' (వన్ నేషన్ వన్ ఎలక్షన్) దిశగా కసరత్తు ముమ్మరమైంది. 2027 నవంబర్ లేదా 2028 ఫిబ్రవరి నాటికి ఈ ప్రక్రియను కార్యరూపంలోకి తీసుకురావాలని కేంద్రం యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జమిలి ఎన్నికల నిర్వహణలో ఎదురయ్యే రాజ్యాంగపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు కేంద్రం ఇప్పటికే న్యాయ నిపుణులతో సుదీర్ఘంగా చర్చించింది. రాజ్యాంగంలోని అధికరణలు 83 (లోక్‌సభ కాలపరిమితి), 172 (అసెంబ్లీల కాలపరిమితి) సహా మొత్తం ఐదు కీలక సవరణలు అవసరమని న్యాయ నిపుణులు సూచించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇప్పటికే 'ఒకే దేశం ఒకే ఎన్నిక'పై మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ ఇచ్చిన నివేదికను కేంద్ర ప్రభుత్వం లోతుగా పరిశీలిస్తోంది. విడివిడిగా ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ ఖజానాపై పడుతున్న వేల కోట్ల రూపాయల భారాన్ని తగ్గించవచ్చు. నిరంతరం ఎక్కడో ఒకచోట ఎన్నికలు ఉండటం వల్ల 'ఎన్నికల కోడ' అమల్లోకి వచ్చి అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయి. జమిలి వల్ల ఐదేళ్ల పాటు పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టే అవకాశం ఉంటుంది. ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యే భద్రతా దళాలు, ప్రభుత్వ సిబ్బంది మరియు ఉపాధ్యాయులకు విరామం లభిస్తుంది. ఈ ప్రతిపాదనపై జాతీయ, ప్రాంతీయ పార్టీల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని పార్టీలు దీనిని స్వాగతిస్తుండగా, ఫెడరల్ స్ఫూర్తికి ఇది విరుద్ధమని మరికొన్ని పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా అసెంబ్లీల కాలపరిమితిని కుదించడం లేదా పెంచడం వంటి అంశాలపై ప్రతిపక్షాలు క్లారిటీ కోరుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఈ అంశంపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించే అవకాశం ఉంది. జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంటులో ఆమోదించడంతో పాటు, మెజారిటీ రాష్ట్రాల ఆమోదం కూడా ఈ ప్రక్రియలో కీలకం కానుంది. ఒకవేళ కేంద్రం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇస్తే, 2027 చివరి నాటికి దేశం సరికొత్త ఎన్నికల వ్యవస్థలోకి అడుగుపెట్టనుంది.

## నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

- అధికారికంగా ప్రకటించిన బోర్డు

**హైదరాబాద్, ఏప్రిల్ 11:**

తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్‌ను పొందవచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ ఫలితాలను నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు పరిశీలించుకోవచ్చు.

## 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ

- సభాస్థలిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు

**జగిత్యాల, ఏప్రిల్ 11:**

జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ లక్షకు పైగా ప్రజలు హాజరవుతారని, అందుకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈశ్వర్ మాట్లాడుతూ ప్రజాభీష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండున్నరేళ్లలో తెలంగాణ అస్తవ్యస్తమైందని విమర్శించారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. జీవన్ రెడ్డి ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించిన ఆయన బీఆర్,ఎస్‌లో చేరారని తెలిపారు. స్థానిక ప్రజలు, కార్యకర్తల అభిప్రాయంతోనే జీవన్ రెడ్డి వచ్చారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మార్గదర్శనం, సూచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

## వర్ణవివక్షకు వ్యతిరేకంగా పోరాడిన పూలే

- మాజీ సీఎం కేసీఆర్ ఘన నివాళి

**హైదరాబాద్, ఏప్రిల్ 11:**

వర్ణ వివక్షకు వ్యతిరేకంగా తన జీవితకాలం పోరాడిన సామాజిక విప్లవకారుడు, సమసమాజ స్థాపన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే అని బీఆరఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా పూలే జాతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సమాజంలో వర్ణ, కుల లింగ వివక్షను రూపుమాపి సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు పూలే అని పేర్కొన్నారు. సబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమవుతుందని చెప్పిన జ్యోతిరావు పూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని అన్నారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి మరీ, చదువు నిరాకరించబడిన భారత మహిళకు విద్య నేర్పాలనే ద□ృఢ సంకల్పాన్ని అనేక కష్టనష్టాల నడుమ అమలు చేసిన మహిళాభ్యుదయ మార్గదర్శి అయ్యారని అని తెలిపారు. పూలే ఆశయాలను నిజం చేస్తూ తన పదేండ్ల ప్రగతి పాలనలో సబ్బండ కులాల అభ్యున్నతి కోసం అమలు చేసి ఫలితాలను సాధించిన పలు రకాల పథకాలను కార్యాచరణను కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. బీసీ కులాల విద్య కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలను ఏర్పాటు చేసి వారికి అంతర్జాతీయ స్థాయి విద్యనందించినామని తెలిపారు. బీసీ కులాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు పూలే ఆశయాలకు అనుగుణంగా తాము గత ప్రభుత్వంలో అమలులోకి తెచ్చిన ప్రగతి కార్యాచరణను చిత్తశుద్ధితో కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. తద్వారా మాత్రమే మహాత్మాపూలేకు మనం ఘన నివాళి అర్పించిన వారమవుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

# జీసీసీల గమ్యస్థానంగా హైదరాబాద్

**మొదటిపేజీ తరువాయి**

పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. నైపుణ్యాలతో కూడిన టేలెంట్ పూల్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్య లేని రోడ్లు, అందుబాటులో ఉండే అద్దెలు ప్రముఖ కంపెనీలని ఆకర్షిస్తున్నాయని తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజి సంస్థ ప్రతినిధులు సచివాలయంలో శ్రీధర్‌బాబుతో శనివారం భేటీ అయ్యారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా సమావేశంలో పాల్గొన్నారు. ఫైనాన్సియల్ మార్కెట్‌కు సంబంధించిన సేవలు అందించే పికో టెక్నాలజీ సంస్థ పికో టెక్నాలజీ ఇండియా అనే అనుబంధ కంపెనీ ద్వారా ఇక్కడ జీసీసీ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ సంసర్భంగా శ్రీధర్‌బాబు వారికి ఇక్కడి అవకాశాలు, మౌలిక వసతుల గురించి వివరించారు. రానున్న 510 సంవత్సరాలు, తర్వాత 20 సంవత్సరాల అవసరాలకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు



మెరుగుపర్చేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. బెంగళూరు, ముంబయి నగరాలతో పోలిస్తే ఇక్కడ ఆఫీసు స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతం ఉందని చెప్పారు. ముంబయిలో అది 52 శాతం మాత్రమేనని తెలిపారు. బెంగళూరు, ముంబయి మెట్రో నగరాల్లో ట్రాఫిక్, వాయు కాలుష్యం ప్రధాన సమస్యలుగా మారినందున ఐటి సంస్థలు, జిసిసిలు హైదరాబాద్‌కు తరలి వస్తున్నాయని తెలిపారు.

**రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు : కోమటిరెడ్డి**

ఇప్పుడున్న నెహ్రూ రింగ్ రోడ్డుకు 30 కిలోమీటర్ల వెలుపల రీజనల్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు ఏర్పాటవుతున్నాయని, రింగ్ రోడ్ల పక్కన రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను ప్రపంచంలోని పెద్ద నగరాలను తలదన్నేలా అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. హయత్‌నగర్ ఎల్బీనగర్‌ల మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. కింది రోడ్డు స్థానిక ట్రాఫిక్ అవసరాలకు వినియోగిస్తామని, పైన ఉండే రెండు అంతస్థుల రోడ్లు నగరం నుంచి వెలుపలకు, లోపలికి వచ్చే వాహనాల కోసం ప్రత్యేకిస్తామని చెప్పారు. నాగపూర్ తర్వాత డబుల్ డెక్కరో రోడ్లు నిర్మిస్తున్న నగరం ఇదేనని అన్నారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో పికో టెక్నాలజి వ్యవస్థాపక సిఇఓ జారొడ్ యుస్టర్, పికో ఇండియా సిఈవో హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు. పికో టెక్నాలజి సీఈవో జారొడ్ యుస్టర్‌కు మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి జ్ఞాపిక అందజేశారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు : బండి సంజయ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11:**

అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం మహాత్మా జ్యోతి రావు పూలే అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళుల ర్పించారు. విద్య పరంగా, ఆర్థికంగా సమాజం అభివృద్ధి కోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. గ్రామాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాదిమంది పేదలకు అక్షర జ్ఞానాన్ని అందించిన మహనీయుడని కొనియాడారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు.

## పంట కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు

**సిద్దిపేట, ఏప్రిల్ 11:**

పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే టి.హరీష్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డును హరీష్ రావు శనివారం సందర్శించారు. నాలుగు రోజులుగా పొద్దు తిరుగుడు, మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని రైతులు ఆయనకు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూస్తోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులను అధికారులు సందర్శించాలన్నారు. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమంటున్నారు.. కానీ పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



## పూలే ఆశయాలకు ప్రతిరూపం మోదీ పాలన

- మహిళా రిజర్వేషన్ బిల్లుతో నవ శకానికి నాంది
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

**హైదరాబాద్, ఏప్రిల్ 11:**

నాడు మహాత్మా జ్యోతిబా పూలే ఏ సామాజిక మార్పు కోసం పరితపించారో నేడు ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఆ ఆశయాలను అక్షరాలా అమలు చేస్తూ మహిళల సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని బీజేపీ¾ రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూల మాల అర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ పూలే దార్శనికతతోనే మహిళా విద్యకు పునాది పడిందని గుర్తు చేశారు. సమాజంలో మహిళలు అభివృద్ధి చెందితేనే దేశం ముందుకు వెళ్తుందనే బలమైన నమ్మకంతో అంటరానితనం, స్త్రీలపై ఉన్న సామాజిక కట్టుబాట్లను ఎదిరించి తన సతీమణి సావిత్రిబాయి పూలేకు విద్యను అందించి 1848లోనే బాలికల కోసం దేశంలో తొలి పాఠశాలను స్థాపించిన ఘనత జ్యోతిబా పూలేకు చెందుతుందని పేర్కొన్నారు. పూలే కలలను సాకారం చేస్తూ చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే 'నారీశక్తి వందన్ అధినియమ్'ను మోదీ ప్రభుత్వం తీసుకురావడం చరిత్రాత్మకమని లక్ష్మణ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు కూడా ఇందులో ప్రత్యేక ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా నిజమైన సామాజిక న్యాయాన్ని మోదీ ప్రభుత్వం అమలు చేసిందని చెప్పారు. 1996 నుండి 2010 వరకు అనేక సార్లు మహిళా బిల్లును ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరిగినప్పటికీ కాంగ్రెస్, దాని మిత్రపక్షాలైన సమాజ్‌వాదీ, ఆర్జేడీ వంటి పార్టీల అడ్డంకుల వల్ల బిల్లు ముందుకు సాగలేదన్నారు. నూతన జాతీయ విద్యా విధానం ద్వారా మాతృభాషలకు ప్రాధాన్యం ఇవ్వడం, ఆడపిల్లలకు సైనిక్ స్కూల్స్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో అవకాశాలు కల్పించడం మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న స్పష్టమైన ఉదాహరణలని వివరించారు. అదే సమయంలో ముద్ర రుణాలు, లఖ్‌పతి దీదీ, నమో డ్రోన్ దీదీ వంటి పథకాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ వారు ఉద్యోగాల్లోనే కా□□ పారిశ్రామికవేత్తలుగా కూడా ఎదగడానికి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని తెలిపారు. కేంద్ర మంత్రివర్గంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు గణనీయ ప్రాతినిధ్యం కల్పించడం వంటివన్నీ సామాజిక న్యాయానికి నిదర్శనాలని ఆయన స్పష్టం చేశారు. 'బేటీ బచావో - బేటీ పడావో' ద్వారా లింగ నిష్పత్తి మెరుగుపడగా 'సుకన్య సమృద్ధి యోజన' ద్వారా 4.2 కోట్లకు పైగా బాలికలకు ఆర్థిక భద్రత కల్పించినట్లు లక్ష్మణ్ చెప్పారు.

# మహిళా విద్యకు ఆద్యులు పూలే దంపతులు

- ఓబీసీల, మహిళాభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయం
- జ్యోతిరావు పూలేకు నివాళులర్పించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 11:**

ఓబీసీల అభ్యున్నతికి, మహిళా సాధికారతకు మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కొనియాడారు. సామాజిక విప్లవకారుడైన జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. అంబర్‌పేటలోని పూలే విగ్రహానికి శనివారం ఆయన పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే, ఆయన భార్య సావిత్రిబాయి పూలేలు దేశంలో మహిళా విద్యకు ఆద్యులని, వారు వేసిన పునాదుల వల్లే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతులు, సమాజంలో అణగారిన వర్గాల విముక్తి కోసం, వారి సామాజిక సమానత్వం కోసం పూలే దంపతులు తమ జీవితాంతం అంకితభావంతో పనిచేశారని గుర్తు చేశారు.



**మహిళా రిజర్వేషన్లు – విప్లవాత్మక నిర్ణయం**

మహిళా హక్కుల విషయంలో పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని నరేంద్ర మోదీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించే చరిత్రాత్మక నిర్ణయం, పూలే కలలను నిజం చేసే దిశగా వేసిన విప్లవాత్మక, సాహసోపేతమైన నిర్ణయమని అభివర్ణించారు. పూలే స్ఫూర్తితోనే వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కుల గణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా ఇలాంటి సమగ్ర గణన జరగడం ఇదే తొలిసారి అని స్పష్టం చేశారు. బీసీ వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి పూలే చేసిన పోరాటమే ఈ నిర్ణయానికి ప్రధాన స్ఫూర్తి అని పేర్కొన్నారు.

**దివ్యాంగుల సంక్షే కేంద్ర ప్రభుత్వ పథకాలు**

పూలే 200వ జయంతి ఉత్సవాలను బీజేపీ, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నాయని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తరపున సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని సనత్‌నగర్, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన వివిధ పరికరాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. సికింద్రాబాద్ నియోజకవర్గం లాలాపేట్ డివిజన్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఆయన పంపిణీ చేశారు. బ్యాటరీతో నడిచే ట్రై సైకిల్స్, సాధారణ ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ (చెవిటి వారికి), ఊతకర్రలు, సెల్‌ఫోన్లు వంటివి ఉన్నాయి. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రూ.2కోట్ల విలువైన వస్తువులను సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో దివ్యాంగుల కోసం నరేంద్ర మోదీ ప్రభుత్వం మంజూరు చేసిందని, సమాజంలో అందరికంటే చిట్టచివర ఉన్న వ్యక్తికి మొదటగా సహకారం అందించాలన్నదే ప్రధాని ఆలోచన అని చెప్పారు. మోదీ ప్రభుత్వం విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగుల రిజర్వేషన్లను 3 శాతం నుండి 4 శాతానికి పెంచిందన్నారు. దివ్యాంగులను ఎవరైనా విమర్శించినా, అవహేళన చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ యాక్ట్ తరహాలో చట్టాలను తీసుకొచ్చామన్నారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో దివ్యాంగుల కోసం ప్రత్యేకమైన ర్యాంప్‌లు, క్యూ లైన్లు, వాష్ రూమ్స్ ఏర్పాటు చేయడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. దివ్యాంగుల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

రాజముద్ర



సంపాదకీయం

# ఆత్మరక్షణలో కాంగ్రెస్!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళేశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్గుల్ రైతులు ఈరాజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# వెనక్కి తగ్గని ఇరాన్

- షరతులకు అంగీకరిస్తేనే చర్చలని స్పష్టీకరణ!
- అమెరికా బృందం ఉపాధ్యక్షుడికి పాక్ ప్రధాని స్వాగతం



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11:** పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలను తొలగించి శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన అమెరికా–ఇరాన్ చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం అడుగుపెట్టి గంటలు గడుస్తున్నా, ఇరాన్ ప్రతినిధులతో నేరుగా భేటీ ఇంకా సాధ్యపడలేదు. తమ డిమాండ్లను నెరవేరిస్తేనే ముఖాముఖి చర్చలకు కూర్చుంటామని ఇరాన్ భీష్మించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని, అక్కడ పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమలులోకి రావాలని ఇరాన్ పట్టుబడుతోంది. దీనితో పాటు ఖతార్‌తో సహా ఇతర అంతర్జాతీయ బ్యాంకుల్లో స్తంభింపజేసిన తమ నిధులను అమెరికా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. ఇరాన్‌పై ఉన్న ఆర్థిక ఆంక్షలను సడలించడంతో పాటు గత యుద్ధ నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా బృందానికి నాయకత్వం వహిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇస్లామాబాద్ చేరుకున్న తర్వాత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సుదీర్ఘంగా చర్చించారు. అంతకుముందు విమానం ఎక్కే సమయంలో వాన్స్ మాట్లాడుతూ తాము శాంతికి సిద్ధంగా ఉన్నామని, కానీ ఇరాన్ తమను తప్పుదారి పట్టించాలని చూస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడం ఉత్కంఠ రేపుతోంది. వాన్స్ బృందంలో మాజీ అధ్యక్షుడి అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ కూడా ఉన్నారు. ప్రస్తుతానికి ఇరు దేశాల ప్రతినిధులు ఒకే హోటల్‌లో విడిది చేసినప్పటికీ నేరుగా కలవలేదు. పాక్ అధికారులే అటు అమెరికా బృందంతోనూ, ఇటు ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ నేతృత్వంలోని బృందంతోనూ వేర్వేరుగా భేటీ అవుతూ రాయబారం నడుపుతున్నారు. అమెరికా ఈ షరతులపై మెత్తబడితేనే రేపు నేరుగా చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' పునరుద్ధరణ కూడా ఈ చర్చల ఎజెండాలో ప్రధానాంశంగా ఉంది.

## చర్చలు విఫలమైతే మరిన్ని దాడులు : ట్రంప్

**న్యూయార్క్:** ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్‌ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు.

# మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

- కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు



**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.



# హోర్ముజ్ దాటిన భారతీయ నౌక

## కాల్పుల విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# పార్లమెంట్‌లో ఆసక్తికర దృశ్యం



- ప్రధాని మోదీ, రాహుల్ స్నేహపూర్వక సంభాషణ!
- జ్యోతిబా ఫులే జయంతి వేడుకల్లో పరస్పరం పలకరించుకున్న నేతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 :** రాజకీయ రణక్షేత్రంలో విమర్శల బాణాలు సంధించుకునే ప్రధాన ప్రత్యర్థులు పార్లమెంటు ప్రాంగణంలో మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ స్నేహపూర్వకంగా ముచ్చటించారు. మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా శనివారం పార్లమెంటులోని 'ప్రేరణా స్థల్' వద్ద నివాళులర్పించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు ప్రత్యేకంగా సంభాషించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమానికి చేరుకున్న ప్రధాని మోదీ తొలుత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి జేపీ నడ్డాలతో పాటు రాహుల్ గాంధీని పలకరిస్తూ ముందుకు సాగారు. అయితే, కొద్ది క్షణాల తర్వాత మళ్లీ వెనక్కి వచ్చిన ప్రధాని, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ ఇరు నేతల మధ్య తీవ్రమైన వాగ్వివాదాలు సాగుతున్న తరుణంలో, ఈ అనూహ్య భేటీకి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇటీవలి కాలంలో విదేశాంగ విధానంపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలు, వాటిని ప్రధాని తిప్పికొట్టిన తీరు రాజకీయంగా వేడి పుట్టించాయి. ట్రంప్ నిర్దేశాల మేరకే మోదీ పాలన సాగుతోందని రాహుల్ ఆరోపించగా, ఆయనను 'స్వయం ప్రకటిత రాజకుమారుడు' అంటూ ప్రధాని ఎద్దేవా చేశారు. ఇటువంటి ఘాటైన రాజకీయ వాతావరణం నెలకొన్నప్పటికీ, పార్లమెంటు ప్రాంగణంలో ఒకరినొకరు గౌరవించుకుంటూ ముచ్చటించడం భారతీయ ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రోడ్డుపైనే రాత పరీక్ష

## బిహార్‌లో విద్యావ్యవస్థ దుస్థితి!



**సివాన్, ఏప్రిల్ 11:** వింతలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారే బిహార్ విద్యావ్యవస్థ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో విమానాశ్రయ రన్‌వేపై పరీక్షలు రాసి వార్తల్లోకెక్కిన అక్కడి విద్యార్థులు, ఇప్పుడు ఏకంగా రోడ్డు పక్కన కూర్చుని పరీక్షలు రాస్తూ కనిపించడం నెటిజన్లను విస్మయానికి గురిచేస్తోంది. సివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సివాన్ జిల్లాలోని ఒక ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు ఇటీవల పరీక్షలు నిర్వహించింది. అయితే, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదిలో వసతులు, కుర్చీలు లేకపోవడంతో యాజమాన్యం వినూత్నంగా (అయినా ప్రమాదకరంగా) ఆలోచించింది. విద్యార్థులను తరగతి గదిలో కాకుండా బయట రోడ్డుకు ఇరువైపులా కూర్చోబెట్టింది. కనీసం కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడంతో చాలామంది కిందనే కూర్చొని, మరికొందరు నిలబడి పరీక్షలు రాయాల్సి వచ్చింది. పక్కనే వాహనాలు హారన్లు కొడుతూ వెళ్తున్నా, జనం రాకపోకలు సాగుతున్నా.. ఆ రొద మధ్యే విద్యార్థులు తీవ్రమైన ఎండలో తలలు వంచుకుని పరీక్షలు రాశారు. ఈ దృశ్యాలపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. "బిహార్‌లో అక్షరాస్యత తక్కువగా ఉండటానికి ఇటువంటి దారుణమైన పరిస్థితులే కారణం" అని ఒకరు కామెంట్ చేయగా, "ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక ప్రైవేట్ సెంటర్లకు వెళ్తే, అక్కడ అంతకంటే హీనంగా ఉందంటూ" మరొకరు విమర్శించారు.

## కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా మహాత్మ జ్యోతిబాపూలే జయంతి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** మహాత్మ జ్యోతి బా పూలె 200వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. శనివారం కలెక్టరెట్ కార్యాలయ సమావేశం హాలు నందు వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతి బా పూలె జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించబడుతుందని, ఆయన సామాజిక సంస్కర్తగా, సమానత్వానికి చేసిన సేవలను స్మరించుకుంటూ ఈ వేడుకలు జరుపుకుంటు న్నామన్నారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన తొలి సంస్కర్తల్లో ఒకరని, కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణకు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, బి.సి అభివృద్ధి శాఖ అధికారి మాధవరెడ్డి, డీఎస్సి డి ఓ జయపాల్ రెడ్డి, గ్రౌండ్ వాటర్ అధికారి రవికుమార్, బీసీ అభివృద్ధి శాఖ అసిస్టెంట్ అధికారి ఎన్.భీమ్ రాజు, బీసీ వెల్ఫేర్ వార్డెన్లు, బీసీ అభివృద్ధి శాఖ సిబ్బంది, కలెక్టరేట్ కార్యాలయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు వాటర్ బాటిల్ అందజేత



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలంలోని ఉప్పల్వాయి గ్రామం ఇటుక బట్టి వద్ద ఉన్న ఆవాస ప్రాంత పాఠశాలను సందర్శించి , పిల్లలకు వాటర్ బాటిల్స్ ను ఎంఈవో ఆనంద్ రావు అందజేశారు, విద్యార్థులు వాటర్ బాటిల్లో నీళ్లు తెచ్చుకోవాలని తెలిపారు, కార్యక్రమంలో సి ఆర్ పి మహమూద్, ఇటుక బట్టి వివి సువర్ణ , విద్యార్థులు, ఇటుక బట్టి వర్కర్స్ పాల్గొన్నారు.

## బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయం

**ఏఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఐసిసి నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.శనివారం సూర్యాపేట మండలం రామన్న గూడెం స్టేజి వద్ద నల్గొండ పార్లమెంటు యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చందాదాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆ గ్రామ సర్పంచ్ అరాల శైలజ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు గ్రామాల నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు వచ్చి పోతుంటారన్నారు.వేసవి దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషమన్నారు . ఈ కార్యక్రమంలో సూర్యాపేట, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి,ధరావత్ వీరన్న నాయక్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్,మాజీ జెడ్పిటిసి చింతమల్ల రమేష్, కౌన్సిలర్ కొండపల్లి దిలీప్ రెడ్డి, సాయి నేత, సైదులు,రామకృష్ణ, అశోక్ కృష్ణ,రవి,వెంకన్న,అనిల్ కుమార్,మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు

**వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా**



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసులు ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు విధానాన్ని అమలు చేస్తున్నట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాధితుల నివాసానికి లేదా వారికి అనుకూలమైన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసులే బాధితుడి వాంగ్మూలాన్ని వారి భాషలో నమోదు చేసి, చదివి వినిపించి సంతకం తీసుకొని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి ప్రతిని అందజేస్తారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు, బలహీన వర్గాల వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నరు. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహ నిరోధక చట్టాలకు సంబంధించిన కేసుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగా పంపిస్తారు. అవసరమైతే ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేస్తారు. పోలీసులు సంఘటన స్థలాన్ని రక్షించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే ప్రారంభిస్తారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది, ఆలస్యం తగ్గుతుంది, అలాగే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ఇబ్బంది తగ్గుతుంది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని ఎస్పీ ఇట్టి సందర్భంగా తెలిపారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థుల బంగారు భవిష్యత్తు

**ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్**

- విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి అంటూ కరపత్రాల పంపిణీ
- అత్యాధునిక టెక్నాలజీ తో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది
- సకల సౌకర్యాలతో అత్యుత్తమ విద్యా బోధన చేస్తున్న ప్రభుత్వ పాఠశాల
- తల్లిదండ్రుల సహకారం.. విద్యార్థి పురోగతికి తోడ్పాటు

**మేడిపల్లి, రాజముద్ర న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోనే విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది పడుతుందని మెడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్ అన్నారు. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి 'ప్రత్యేక అడ్మిషన్ల ప్రచారం' (స్పెషల్ ఎన్రోల్మెంట్ డ్రైవ్) లో భాగంగా శనివారం పాఠశాల ఉపాధ్యాయ బృందం మెడిపల్లిలో భారీ ర్యాలీ నిర్వహించి, ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించేందుకు అవసరమైన అత్యాధునిక టెక్నాలజీతో కూడిన బోధనను ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నామని తెలిపారు. కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, సైన్స్, గణితం వంటి క్లిష్టమైన అంశాలను కూడా డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా వివరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా సుశిక్షితులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఇంగ్లీష్ మీడియం బోధన సాగుతోందని వివరించారు.పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరిస్తూ.. విశాలమైన ఆటస్థలం, అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, విద్యార్థుల సృజనాత్మకతను వెలికితీసేందుకు నిర్వహిస్తున్న వివిధ సాంస్కృతిక కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. విద్యా బోధనతో పాటు విద్యార్థుల క్రమశిక్షణ, నైతిక విలువలు, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఉపాధ్యాయ బృందం గ్రామంలోని వీధివీధినా తిరుగుతూ పాఠశాల ప్రత్యేకతలు, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం వంటి పథకాలపై అవగాహన కల్పించారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు సహకరించాలని తల్లిదండ్రులను కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుండి మంచి స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎల్. సత్యప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





## మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి: రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీజేపీ నేతల ఆగ్రహం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలోని మూటపురం గ్రామంలో మొక్కజొన్న సాగు చేసిన రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో చూపుతున్న జాప్యం వల్ల రైతులు కన్నీరు పెడుతున్నారని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని పలు పొలాలను బి జె పి నాయకులు సందర్శించి, రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు...ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ, మొక్కజొన్న కోతలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా, ప్రభుత్వం ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం శోచనీయమన్నారు.. కేంద్రాల ఏర్పాటులో జాప్యం జరగడం వల్ల రైతులు బెంబేలెత్తిపోతున్నారని, వాతావరణ మార్పులతో వర్షం వస్తే పంట మొత్తం పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ మాట్లాడుతూ, మార్కెట్‌లో దళారుల దోపిడీ పరాకాష్టకు చేరిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.2400 ఉండగా, కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు గత్యంతరం లేక దళారులకు రూ.1700 నుంచి 1800లకే అమ్ముకుంటున్నారని తెలిపారు. క్వింటాలకి సుమారు 600 నుండి 700 రూపాయల వరకు నష్టపోవడం వల్ల రైతుల శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికార యంత్రాంగం కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో రైతులకు అండగా నిలవాలని బీజేపీ నేతలు కోరారు. కొన్ని జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెబుతున్నా, నేలకొండపల్లి వంటి ప్రాంతాల్లో రైతులు ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారని వారు గుర్తు చేశారు. ప్రభుత్వం వెంటనే యుద్ధప్రతిపాదికన కొనుగోలు కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేసి, రైతులకు మద్దతు ధర దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పాలేరు ఇన్చార్జి నున్నా రవి, మండల ప్రధాన కార్యదర్శులు మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, నాయకులు కట్ట అప్పారావు, సూరపల్లి జ్ఞాన రత్నం, సయ్యద్ మోహినుద్దీన్, పుట్టా సత్యనారాయణ, మూడు రమేష్, బానోతు శ్రీనివాసరావు, రైతులు ఏలూరి రామారావు, బాగా మురళి, భాష నెహ్రూ వెంకన్న తదితరులు పాల్గొన్నారు

## అంగన్వాడీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది:మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



- ఘనంగా పోషణ పక్వాడ్ కార్యక్రమం
- 331 మంది అంగన్వాడీలకు మొబైల్ ఫోన్లు పంపిణీ

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** పేదవారికి అండగా ఉంటూ,అభివృద్ధికి పర్యాయ పదంగా ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.తిరుమలాయ పాలెం మండలంలో శనివారం ఆయన పర్యటించారు.మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి పాల్గొని లబ్ధిదారులకి మంజూరైన కళ్యాణ లక్ష్మి ,షాధీ ముభారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు.జిల్లా సంక్షేమాధికారిణి వేల్పుల విజేత అధ్యక్షతన నిర్వహించిన పోషణ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొని పాలేరు నియోజకవర్గంలోని 331 మంది అంగన్వాడి టీచర్లకి మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 15 వేల అంగన్వాడి టీచర్ల పోస్టుల భర్తీ చేస్తామని,అదేవిధంగా జిల్లాలో 1840 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా అందులో 501 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని,వాటికి త్వరలోనే శాశ్విత భవనాలను నిర్మిస్తామని చెప్పారు.ఎన్నికల మేనిఫెస్టో లో పొందుపరిచిన విధంగా అంగన్వాడీ టీచర్లు,హెల్పర్ల జీత భత్యాల పెంపుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం కొత్త జీవో**

గత ప్రభుత్వాలు అంగన్వాడీల సమస్యలపై నిర్లక్ష్య ధోరణి అవలంబించారని,కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే అంగన్వాడీల సంక్షేమం కోసం కొత్త జీవో తెచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందేలా కృషి చేసిన ఘనత రాష్ట్ర మహిళ,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు దక్కుతుందని తెలిపారు.అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ ద్వారా 16 రిజిస్టర్ ల పని భారాన్ని తగ్గించడం,సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని తద్వారా గర్భిణీలు,బాలింతల ఆరోగ్య సమాచారాన్ని డిజిటల్ విధానంలో త్వరగా నమోదు చేయవచ్చన్నారు.ఈ స్మార్ట్ ఫోన్లను సమర్థవంతంగా వినియోగించుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని మంత్రి పొంగులేటి సూచించారు.అనంతరం హైదర్ సాయిపేట గ్రామంలో ఒక కోటి 35 లక్షల రూపాయల వ్యయంతో హైదర్సాయిపేట నుండి పడమటి తండ (వయా దర్గా) వరకు నిర్మించనున్న బి.టి. రోడ్డు పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో ఏదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిన అనిత,జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి,సర్పంచ్ లు వనవాసం నరేందర్ రెడ్డి,గూడూరు ఉపేందర్,ధరావత్ సుజాత, నల్లమల కీర్తి,అజ్మీరా నీలిమ,కర్నాటి రాజేంద్రప్రసాద్, బానోత్ చీమ్లా,మోర అనిల్ రెడ్డి,మాజీ ఎంపిపిలు కొప్పుల అశోక్,బోడా మంగీలాల్,నాయకులు సంగబత్తుల సుమన్ రెడ్డి,గోళ్ల లింగయ్య,సిడిపివోలు, ఏసిడిపివోలు,సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు,పార్టీ శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.

# పూలే ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**సూర్యాపేట జిల్లా జాయింట్ కలెక్టర్ కె సీతారామారావు**



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్:** సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలే అని సూర్యాపేట జిల్లా జాయింట్ కలెక్టర్ కే సీతారామరావు చెప్పారు. శనివారం జిల్లా కేంద్రంలోని యం.జి. రోడ్డు సర్కిల్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా జ్యోతి రావు పూలే 200 వ జయంతి కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కే. సీతారామా రావుతో మున్సిపల్ చైర్ పర్సన్ నివేదిత కలిసి పాల్గొని,జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సీతారామరావు మాట్లాడుతూ మహనీయుడు జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం గొప్ప గౌరవమని తెలిపారు.సమానత్వ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారని ఉద్బోధించారు.ఆ కాలంలో కుల,మత భేదాలు ఉన్న పరిస్థితుల్లో సామాజిక సంస్కరణలకు పూలే శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. మొదటగా తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబోధన చేసి, ఆ తర్వాత ఆమె ద్వారా బాలికల విద్యకు మార్గం సుగమం చేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు.ఆ రోజుల్లో కుల వివక్ష కారణంగా అనేక వర్గాల ప్రజలను దేవాలయాలు,పాఠశాలల్లోకి అనుమతించని పరిస్థితులను పూలే ధైర్యంగా ఎదిరించి సమాజంలో మార్పు తీసుకువచ్చారని తెలిపారు. అందుకే వారి జయంతిని ఘనంగా జరుపుకుంటున్నా మని అన్నారు.కుల వివక్ష లేకుండా సమాజం అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరూ విద్యను పొందాలని మహాత్మా జ్యోతి రావు పూలే బోధించిన సిద్ధాంతాలని తెలిపారు.ఆ కాలంలోనే మహిళా విద్య కోసం పూలే చేసిన కృషి అపారమని గుర్తుచేశారు. పేదలకు నాణ్యమైన విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు వంటి పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు.జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా వారి ఆశయాలను మరోసారి స్మరించుకొని,మంచి సమాజ నిర్మాణం కోసం వారు చూపిన మార్గంలో నడవాలని పిలుపు నిచ్చారు. మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత మాట్లాడుతూ మహిళల విద్య కోసం పూలే కృషి చేశారని, మొదటిగా తన సహచరికి విద్య నేర్పి తద్వారా సమాజంలో విద్య అందరికీ అందేలా కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవరావు,డిఎస్పి ప్రసన్న కుమార్,డిటిడిఓ శంకర్,డిఎంఓ నాగేశ్వర శర్మ,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నరసింహులు,ఎస్సీ వెల్ఫేర్ అధికారి కొల్లి లత,టీఎన్జీవోస్ జిల్లా సెక్రెటరీ దున్న శ్యామ్,మాజీ శాసనసభ్యులు దోసపాటి గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, పెరుమాళ్ళ అన్నపూర్ణ,డాక్టర్ కృష్ణ బంటు,డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్,వసంత సత్యనారాయణ పిల్లే,చల్లమల్ల నరసింహ,వై వెంకటేశ్వర్లు,చింతలపాటి చిన్న శ్రీరాములు,తప్పెట్ల శ్రీరాములు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చల్లమల్ల హస్సేన్,నిద్ర సంపత్,మడిపడిగ సైదులు, కే.వెంకటేశ్వర్లు, బెల్లంకొండ రామ్మూర్తి, శ్రీకాంత్, జీడి బిక్షం, బయ్య మల్లి కార్జున్, కోట గోపి, యాతాకుల రాజయ్య,పలు వార్డుల కౌన్సిలర్లు,జిల్లా అధికారులు,వివిధ సంఘాల నాయకులు, కుల సంఘ నాయకులు,ప్రతినిధులు, అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్ల కొర్రీలు తప్పేనా..?

- ప్రతిఏటా రైతులకు తప్పని కోత తిప్పలు
- అధికారులు పర్యవేక్షణ పెట్టేనా..?

**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు చివరకు ధాన్యం విక్రయించే సమయంలో ప్రతిఏటా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలోని బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలోని పలు మిల్లుల తీరుతో రైతులు గతంలో నానా ఇబ్బందులు పడిన ఘటనలు ఉన్నాయి. మిల్లర్ల తీరుతో గతంలో రోడ్డుపై ధర్నాలు సైతం చేసిన ఘటనలు సైతం లేకపోలేదు. ఈసారి అలాంటి ఘటనలు పునారావృత్తం కాకుండా అధికారులు చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

**కోతల పేరిటా కోర్రీలు..**

సోసైటీ, ఐకెపీ ఆధ్వర్యంలో కొనుగోలు అయిన ధాన్యం మిల్లులకు వెళ్లే సరికి ధాన్యం తక్కువగా ఉందని, తేమ శాతం ఎక్కువగా ఉందనే కారణాలు చూపుతూ రైతులను భారీగా దోచుకుంటున్నారు. ముఖ్యంగా సన్న చిన్న కారు రైతులు ఈ తీరుతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. వారికి ఉన్న కొద్దిపాటి పొలంను సైతం కోత ల వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని, ఇసారైనా ఇలాంటి ఘటనలు పునారవృత్తం కాకుండా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

**అధికారులు, ప్రజాప్రతినిధుల ఆదేశాలు బేఖాతర్...**

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు రావద్దని, మిల్లర్లు సైతం రైతులకు సహకరించాలని అధికారులు, ప్రజాప్రతినిదులు సభలు, సమావేశాల్లో సూచిస్తూనే ఉన్నారు. కానీ పలు మిల్లర్ల తీరు ఇందుకు విరుద్ధంగా కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైన నాటి నుంచి మిల్లుకు వెళ్లిన అనంతరం అక్కడ సైతం రైతులు ఏదో ఒక రూపంలో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తేమశాతం, పొల్లు ఇతర ఏదైనా కారణాలు చూపుతూ కొనుల గోలు చేసిన ధాన్యంలో మళ్లీ కోత విధిస్తూ రైతులను దోచుకుంటున్నారు. ఈసారైనా ఇలాంటి ఘటనలు పునారవృత్తం కాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏంతైనా ఉంది. చర్యలు తీసుకుంటారా..? లేదా..? అనేది వేచి చూడాల్సిందే.





# నవభారత దీప్తి మహాత్మ జ్యోతిబాపూలే

**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** మహాత్మ జ్యోతిబాపూలే 200 వ జయంతిని పురుష్కరించుకొని మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ప్రేస్ క్లబ్ అధ్యక్షులు ఎల్లుట్ల సైదులు జ్యోతిబాయ్ పూలే చిత్రపటానికి పూలమాల వేశారు ,అయన మాట్లాడుతూ, నైతిక ధైర్యం నిరంతర సత్య అన్వేషణ సామాజిక శ్రేయస్ పట్ల అచంచలమైన అంకితభావం వలబోసిన ఉదాత జీవితం తను జ్యోతిబాపూలేదన్నారు ఎన్నో ఉద్యమాలకు సారధిగా సారథ్యం వహించి,తను,చిరస్మరణీయులయ్యారని ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు దేశ జనాల్లో నింపిన ఆత్మవిశ్వాసం అని నాగరికత పరిణామ క్రమంలో ఆయన చేసిన ఆసమానమైన సేవలు నేటికి లక్షలాది మందికి స్ఫూర్తిగా అందిస్తున్నాయని సైదులు అన్నారు తదుపరి

**పంబ సూర్య మాట్లాడుతూ**

మహాత్మా జ్యోతిబాపూలే జ్ఞానం కొందరి గుత్తాధిపత్యం కాదని ఆ శక్తి అందరికీ అందాలని స్పష్టంగా గుర్తించారని అనేకులు అక్షరం జ్ఞానం అందని ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం విద్యా అవకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలను తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే అని కొనియాడారు.

**సీనియర్ జర్నలిస్ట్ శివాజీ మాట్లాడుతూ**

నేడు జరిగే ఆయన దిశతాబ్ది జయంతి ఉత్సవాలు ప్రారంభ వేళ ఆయన ఆశయాలకు పునరంకితం కావటమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళులని తెలిపారు ఇప్పటికీ వారి జన్మించి రెండు వందల ఏళ్ళు గడుస్తున్నా మహాత్మ జ్యోతిరావు పూలే గతకాలపు శక్తి గానే కాకుండా నవభారత భవితకు మార్గదర్శక నిలిచారు అన్ని అయన తెలిపారు,

**నివాళులు అర్పించిన వారిలో**

సీనియర్ జర్నలిస్ట్ ఎల్లుట్ల సైదులు, డా" పంబసూర్య , నంద్యాల శివాజీ, రామచంద్ర, ప్రసాద్, వీరభద్రం, రవి తదితరులు జర్నలిస్టు మిత్రులకు పాల్గొన్నారు

# పేదల అభివృద్ధి,సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం:మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

- ఏదులాపురం మున్సిపాలిటి అభివృద్ధికి 58 కోట్ల 95 లక్షలు
- పలు అభివృద్ధి పనులకి శంకుస్థాపన



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలని,ఎన్నికల తర్వాత ప్రజాసంక్షేమం,అభివృద్ధి మాత్రమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,ఎటువంటి రాజకీయాలకు తావు లేదని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ఖమ్మం రూరల్ మండలం,ఏదులాపురం మున్సిపాలిటీలో శనివారం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డితో కలిసి ఆయన పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.వరంగల్ క్రాస్ రోడ్డు ఆటోనగర్‌లో ఖమ్మం–వరంగల్ ఆర్ అండ్ బి రోడ్డు నుండి మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వయా (ఆటో నగర్) వరకు 4 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి,ఏదులాపురం మునిసిపల్ ప్రాంతంలోని లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి ,సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పొంగులేటి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏదులాపురం మునిసిపాలిటీ 30 డివిజన్ లలో సుమారు 4 కోట్ల 50 లక్షలతో రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశామని,ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మునిసిపాలిటీలో మొత్తం 58 కోట్ల 95 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.అనంతరం ఖమ్మం రూరల్ మండలంలోని మంగళగూడెం గ్రామంలో 2 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో కొత్తూరు నుండి కాచిరాజుగూడెం రోడ్డు, స్లాబ్ కల్వర్టు నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేసి మాట్లాడుతూ గత పర్యటనలో ఈ ప్రాంతంలో వరదల సమస్యను స్వయంగా పరిశీలించి ప్రజలకు ఇచ్చిన హామీని నేడు నెరవేర్చామని తెలిపారు.ఈ కల్వర్టు నిర్మాణం నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

**ఆర్థిక ఇబ్బందుల్లోనూ అభివృద్ధి పథకాలు..!**

ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికే ప్రాధాన్యతనిస్తూ 200 యూనిట్ల ఉచిత విద్యుత్,కొత్త రేషన్ కార్డులు,సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాల పాటు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం ప్రజా పాలన మొదటి సంవత్సరంలోనే ప్రతి నియోజక వర్గానికి 3 వేల 500 ఇళ్లను మంజూరు చేసిందని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల రెండవ విడతను కొద్ది రోజుల్లోనే ఇస్తామని తెలిపారు.2 లక్షల రూపాయలు వరకు రైతు రుణమాఫీ చేశామని, రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు.మహిళల కోసం ప్రతి సంవత్సరం 23 నుండి 24 వేల కోట్ల వరకు వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం వచ్చిన మొదటి సంవత్సరంలోనే 73 వేల ఉద్యోగాలు ఇచ్చామని, విద్య, ఆరోగ్య రంగాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత,మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు,పాలేరు నియోజక వర్గ ప్రత్యేక అధికారి రమేష్,ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్,ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు,పార్టీ శ్రేణులు,తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సమానత్వానికి మార్గదర్శి మహాత్మ జ్యోతిరావు పూలే

**నేలకొండపల్లి లో ఘనంగా జయంతి వేడుకలు**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండల కేంద్రంలోని భక్త రామదాసు ప్రెస్ క్లబ్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించగా, రైతు నాయకుడు చావా కిరణ్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పూలే సమాజంలో ఉన్న కుల వివక్ష, అసమానతలను నిర్మూలించేందుకు నిరంతరం పోరాడిన గొప్ప సంస్కర్త అని తెలిపారు. వెనుకబడిన వర్గాలకు విద్య అత్యవసరమని భావించి పాఠశాలలు స్థాపించి, మహిళల విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు.అలాగే సత్యాన్వేషణ కోసం స్థాపించిన సంస్థ ద్వారా అన్ని వర్గాల ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమాన హక్కుల కోసం పోరాడిన నాయకుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శిలు మల్లెపోయిన గోవిందరావు, రాజా రామక్రిష్ణ, నాయకులు కట్ట అప్పారావు, సూరపల్లి జ్ఞానరత్నం, సయ్యద్ మొయినుద్దీన్, సత్యనారాయణ మూడు రమేష్, భానోతు శ్రీనివాసరావు, మురళి భాషా నెహ్రూ పాల్గొన్నారు గ్రామ ప్రజలు పాల్గొని పూలే సేవలను స్మరించారు.

# చాకచక్యంగా దోపిడి గ్యాంగ్ అరెస్టు

- ఆరుగురు నిందితులు రిమాండ్
- పరారీలో మరో నిందితుడు...
- నాలుగు రోజుల్లోనే చేదించిన పోలీసులు...
- అభినందించిన డిసిపి...



**కీసర,రాజముద్ర న్యూస్:** దోపిడీ గ్యాంగ్ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మల్కాజ్గిరి కమిషనరేట్ డిసిపి శ్రీధర్ తెలిపారు. శనివారం కీసర పోలీస్ స్టేషన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. నాలుగు రోజుల క్రితం ఒకరిపై దాడి చేసి 15 గ్రాముల గోల్డ్ , షిఫ్ట్ కార్, ఆరు సెల్ఫోన్లో, ఒక స్కూటీ స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు నాలుగు రోజుల్లో కేసులు చేదించారు. ఏడుగురు నిందితుల్లో ఒకరు తప్పించుకోగా ఆరుగురుని అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. మరొక్కరు పరారీలో ఉన్నాడని డిసిపి శ్రీధర్ తెలిపారు. వీరంతా గ్రెండర్ గే యాప్ ద్వారా ట్రాప్ చేసి పరిచయాలు పెంచుకొని దోపిడీలకు పాల్పడుతున్నారని తెలిపారు. గ్రేండర్ గే యాప్ ద్వారా వీడియోలు, ఫోటోలు తీసి బ్లాక్మెయిల్ చేస్తూ సొత్తును దోచుకుంటున్నారని తెలిపారు. గతంలో కీసర, ఘట్కేసర్ అబ్దుల్లాపూర్ మెట్ తదితర ప్రాంతాలలో వీరు దొంగతనాలు చేసినట్టు డిసిపి శ్రీధర్ తెలిపారు. నిందితులైన కుసుమ కార్తీక్, రామ్ రాజా, బబ్లు సింగ్, కందుల సాయి తేజ, గండ్ల శ్రావణ్, చెన్నకేశవులను అరెస్టు చేయగా మరో నిందితుడు పవన్ కళ్యాణ్ పరారీ ఉన్నాడు. వీరందరూ వరంగల్ ప్రాంతానికి చెందినవారుగా గుర్తించమన్నారు. సోషల్ మీడియా ప్రైవేట్ యాప్ మోజులో పడద్దని యువత అప్రమత్తంగా ఉండాలని డిసిపి శ్రీధర్ సూచించారు. ఈ కేసును నాలుగు రోజుల్లో చేధించిన కీసర పోలీసులను డిసిపి అభినందించారు. ఈ సమావేశంలో ఎసిపి చక్రవర్తి, కీసర సి ఐ ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. దొంగిలించిన సొత్తు, వాహనాలను స్వాధీనం చేసుకున్నామని డిసిపి శ్రీధర్ తెలిపారు.

# బడుగుల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే..

- చదువు ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయులు పూలే..
- ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత..



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్ :** బడుగు బలహీన ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.శనివారం జిల్లా కేంద్రం ఎంజి రోడ్డు సమీపంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు.అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అడుగుజాడలే స్ఫూర్తిగా పయనించాలని పేర్కొన్నారు. మహిళలు చదువుకుంటే వారి కుటుంబము బాగుంటుందని, సమాజం, దేశం బాగుంటుందని, అప్పటిలోనే స్త్రీ విద్య అవసరాన్ని గుర్తించి మహిళల కోసం ఓ ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేశారని తెలిపారు. అంతేకాకుండా తన భార్య అయినటువంటి సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి,వారిని ఆ పాఠశాలలో ఉపాధ్యాయ రాలినిగా చేసిన మహనీయుడని అన్నారు. ఈ భారతదేశంలో మహాత్మా అని ఇద్దరినీ అంటారని, ఒకడు మహాత్మా గాంధీ అయితే మరొకరు మహాత్మ జ్యోతిబా పూలే అని సామాజిక సంస్కరణలు,మానవ హక్కులు, సమ సమాజ సమహిళల విద్యాభివృద్ధికి నాంది పలికిన మహాత్ముడని అన్నారు.వారి ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం మనపై ఉందని తెలిపారు. మహాత్మ జ్యోతిబా పూలే సామాజిక సంస్కరణల నాంది పలికి, సామాజిక అసమానతల మీద పోరాటం చేసి మహాత్మా అని పేరు పొందినటువంటి మహానుభావుడన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని అధికారికంగా జరుపుకోవాలని ఆదేశించారని, మహాత్మ జ్యోతిబా పూలే ఆదర్శ బాటలో మనమందరము నడవాలన్నారు.జిల్లాలో అక్షరాస్యత పెరగాలని, ఆడపిల్లలు బాగా చదువుకోవాలని,వారికి కావాల్సిన అన్ని సదుపాయాలను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని అన్నారు.



# శాంసన్ సెంచరీ.. చెన్నై సూపర్ విక్టరీ

## ఢిల్లీ క్యాపిటల్స్ పై 23 పరుగుల తేడాతో ఘన విజయం

## బౌలింగ్ లో అదరగొట్టిన జెమీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్

**చెన్నై, ఏప్రిల్ 11:** ఐపీఎల్ లో భాగంగా చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ 23 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. సంజు శాంసన్ అద్భుత సెంచరీతో చెలరేగగా.. బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత ఇరవై ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 189 పరుగులకే పరిమితమై పరాజయాన్ని మూటగట్టుకుంది.

### ఆకాశమే హద్దుగా శాంసన్

టాస్ గెలిచిన ఢిల్లీ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన చెన్నై బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 56 బంతుల్లోనే 115 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు భారీ స్కోరును అందించాడు. అతడికి తోడుగా ఆయుష్ మ్హాత్రే 36 బంతుల్లో 59 పరుగులు చేసి అద్భుత సహకారం అందించాడు. చివర్లో శివమ్ దూబే పది బంతుల్లో 20 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు చెన్నై బ్యాటర్ల దాటికి తేలిపోయారు.

### తడబడిన ఢిల్లీ బ్యాటర్లు

213 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ ఏ దశలోనూ విజయ తీరాల వైపు పయనించలేదు. ట్రిస్టన్ స్టబ్స్ 38 బంతుల్లో 60 పరుగులు, పాతుమ్ నిస్సాంక 24 బంతుల్లో 41 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేసినా లాభం దక్కలేదు. చివర్లో అశుతోష్ శర్మ పది బంతుల్లో 19 పరుగులతో మెరిశాడు. చెన్నై బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కు ఢిల్లీ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై బౌలర్లలో జెమీ ఓవర్టన్ కేవలం 18 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి ఢిల్లీ పతనాన్ని శాసించాడు. అన్షుల్ కాంబోజ్ మూడు వికెట్లు తీయగా.. నూర్ అహ్మద్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.








# బౌలర్ల ఘోర వైఫల్యం.. సన్‌రైజర్స్ పరాజయం

## 219 పరుగులు చేసినా కాపాడుకోలేని దైన్యం

## పంజాబ్ చేతిలో ఆరు వికెట్ల తేడాతో చిత్తు

**చండీగఢ్, ఏప్రిల్ 11:** పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చెత్త బౌలింగ్ తో చేజేతులా ఓటమిని కొనితెచ్చుకుంది. బ్యాటర్లు భారీ స్కోరు అందించినా.. బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేక చతికిలబడ్డారు. ఫలితంగా 220 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ కేవలం 18.5 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. పంజాబ్ బ్యాటర్ల ధాటికి సన్‌రైజర్స్ బౌలింగ్ లోపాలు, మైదానంలో పక్కా వ్యూహం లేమి స్పష్టంగా బయటపడ్డాయి.

### వృథా అయిన అభిషేక్ శ్రమ

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) క్రీజులో విధ్వంసం సృష్టించగా.. ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 38), హెన్రిచ్ క్లాసెన్ (33 బంతుల్లో 39) రాణించారు. పంజాబ్ బౌలర్లలో శశాంక్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. బ్యాటర్లు తమ బాధ్యతను అద్భుతంగా నెరవేర్చినా, ఆ స్కోరును కాపాడుకోవడంలో హైదరాబాద్ బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. సరైన లైన్, లెంగ్త్ లేకుండా బంతులు వేస్తూ పంజాబ్ బ్యాటర్లకు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

### పంజాబ్ బ్యాటర్ల ఊచకోత

భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లపై ఎక్కడా కనికరం చూపలేదు. ప్రియాన్ష్ ఆర్య (20 బంతుల్లో 57), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (25 బంతుల్లో 51) అర్ధశతకాలతో చెలరేగడంతో పవర్ ప్లేలోనే సన్‌రైజర్స్ బౌలర్లు చేతులెత్తేసినట్లు కనిపించింది. భాగస్వామ్యాలను విడదీయడంలో కెప్టెన్ వ్యూహాలు ఏమాత్రం పనిచేయలేదు. శివాంగ్ కుమార్ మూడు వికెట్లు, హర్ష్ దూబే ఒక వికెట్ తీసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగుతూ సన్‌రైజర్స్ బౌలింగ్‌ను చీల్చిచెండాడాడు. చెత్త బౌలింగ్, పేలవమైన ఫీల్డింగ్ కారణంగా హైదరాబాద్ ఏడు బంతులు మిగిలి ఉండగానే పరాజయాన్ని మూటగట్టుకుంది. పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ అయ్యర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

రాజముద్ర

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.





## ప్యారడైజ్ నుంచి కాయడు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయడు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయడు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.




## ఓటీటీలోకి యూత్

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు, బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగపూరితంగా తెరకెక్కించారు.




## తమ్ముడు టైటిల్ కోసం నాగార్జున పెద్దమనసు

సినీ పరిశ్రమలో సినిమా టైటిల్స్ మారడం, ఒకరి దగ్గరున్న టైటిల్ మరొకరు తీసుకోవడం చాలా సాధారణ విషయం. ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ అయిన టైటిల్‌ను అవసరమైతే రిక్వెస్ట్ ద్వారా లేదా పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలాంటి అరుదైన, ఆసక్తికర సంఘటనల్లో ఒకటి పవన్ కళ్యాణ్ మరియు నాగార్జున మధ్య జరిగిన 'తమ్ముడు' టైటిల్ వ్యవహారం. 'తొలిప్రేమ' భారీ విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే దర్శకుడు అరుణ్ ప్రసాద్ తో కలిసి ఆయన చేసిన సినిమా 'తమ్ముడు'. ఈ చిత్రం విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, పవన్‌ను యూత్ ఐకాన్‌గా మరింత బలపరిచింది. ముఖ్యంగా పాటలు, స్టైల్, యాక్షన్, కామెడీ అన్నీ కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'తమ్ముడు' అనే టైటిల్ మొదట నాగార్జున వద్దే ఉంది. ఆయన, హరికృష్ణ కలిసి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఒక సినిమా చేయాలని ప్లాన్ చేశారు. ఆ కథకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను నిర్ణయించి ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ కూడా చేయించారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమా కోసం నిర్మాత శివ రామకృష్ణ ఆ టైటిల్‌ను నాగార్జునను అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించి 'తమ్ముడు' టైటిల్‌ను ఇచ్చేశారు. తరువాత నాగార్జున తన సినిమాకు 'సీతారామరాజు' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. ఇదే సమయంలో పవన్ నటించిన 'తమ్ముడు' కూడా భారీ హిట్ అయింది. ఇది టాలీవుడ్‌లోని సానుకూల వాతావరణాన్ని, కళాకారుల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.




## స్వయంభు టీజర్‌కు భారీ స్పందన

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.



## ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న సారా అర్జున్

బాలీవుడ్ నటి, 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ శనివారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి ఆలయానికి చేరుకున్న ఆమెకి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక సారా మహాకాళేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన భస్మ హారతి సేవలో పాల్గొంది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్ర ముగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనకు మాటలు రావడం లేదని, స్వామివారి పిలుపు రావడం వల్లే తాను ఇక్కడికి రాగలిగానని తెలిపారు. ప్రపంచంలో దీనిని మించిన గొప్ప అనుభూతి మరొకటి లేదని, ఈ పర్యటన తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



Printed, Published and Owned by RAVU RAJITHA, Printed at KAKATHIYA PRINTERS, LN Colony, Uppal IDA, Uppal. Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, RNI NO : TELTEL/2024/86684, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com